క్లుప్తంగా

ఉపాధ్యాయులకు సన్మానం



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని బెజవాడ బుజ్జమ్మ బాలికోన్నత పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై ఇతర పాఠశాలలకు వెళ్తున్న ఉపాధ్యాయులను శనివారం ఘనంగా సన్మానించారు. హెచ్ఎం సుజాత బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులను నేడూ చెల్లించొచ్చు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ బిల్లులను ఆదివారం యథావిధిగా చెల్లించొచ్చని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు పనిచేయనున్నాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రమణారెడ్డి సేవలు ఎనలేనివి



సత్కరిస్తున్న నేతలు

నెల్లూరు(అర్బన్): ఆరోగ్య శాఖలో డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్‌గా ఏనుగు రమణారెడ్డి ఎనలేని సేవలను అందించారని ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు కొనియాడారు. ఉద్యోగ విరమణ పొందనున్న ఆయన్ను సంతపేటలో శనివారం సత్కరించిన అనంతరం సుధాకర్‌రావు మాట్లాడారు. రాష్ట్ర స్థాయి నేతగా రమణారెడ్డి ఎదగడాన్ని అభినందించారు. ఆయన శేషజీవితం హాయిగా సాగాలని కాంక్షించారు. అనంతరం ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో హంస ఆఫీస్ బేరర్లకు ప్రాధాన్యం కల్పించిన డీఎంహెచ్ఓ సుజాత, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు కృతజ్ఞతలను సుధాకర్‌రావు తెలియజేశారు. హంస జిల్లా సెక్రటరీ కమల్‌కిరణ్, గౌరవాధ్యక్షురాలు ఇందిర, నేతలు మజరుల్లా, ఏటూరి జయశ్రీ, గౌస్‌బాషా, ఖాదర్ మస్తాన్, పరిమళ, అరవ కుమారి, వైద్య, ఆరోగ్యశాఖ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ కల్పం శ్రీనివాసులు పాల్గొన్నారు.

అర్బన్ బ్యాంక్ మహాజన సభ



మాట్లాడుతున్న నాగేంద్రసాయి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నెల్లూరు కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ షేర్ హోల్డర్లకు.. వచ్చిన లాభాల్లో 12 శాతం డివిడెండ్‌ను ఇస్తున్నామని బ్యాంక్ చైర్మన్, ఏపీ ఫెడరేషన్ చైర్మన్ అరిగెల నాగేంద్రసాయి పేర్కొన్నారు. నగరంలోని టౌన్‌హాల్లో బ్యాంక్ మహాజన సభను శనివారం నిర్వహించారు. సహకార పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. నగర, రూరల్ ప్రాంతాల్లో నూతనంగా బ్రాంచ్‌లను ఏర్పాటు చేసే అవకాశం లభించిందని వివరించారు. 2024 – 25 ఆర్థిక సంవత్సరానికి బ్యాంక్‌కు వచ్చిన నికర ఆదాయం రూ.79,52,456లో షేర్ హోల్డర్లకు డివిడెండ్ రూపంలో రూ.27,55,511ను అందజేయనున్నామని చెప్పారు. సూపర్ సీనియర్ సిటిజన్లకు 9.5 శాతం వడ్డీని ఇస్తున్నామని వెల్లడించారు. రుణాలకు సంబంధించిన వాయిదాలను క్రమం తప్పకుండా చెల్లించిన ఖాతాదారులను సత్కరించారు. బ్యాంక్ వైస్ చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్లు వినోదిని, మహేశ్వరి, జయకోటేశ్వరరావు, ప్రభాకర్‌రెడ్డి, అమర్‌ఖాసిం, నాగలక్ష్మి, శ్రీనివాసమూర్తి, లతీఫ్ అహ్మద్, వెంకటేశ్వరరావు, జీవన్ శేఖర్‌రెడ్డి, సీఈఓ అనిత తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్య మిథ్యేనా?

విద్యాహక్కు చట్టానికి ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు తూట్లు పొడుస్తున్నాయి. ఈ చట్టాన్ని అనుసరించి పేద విద్యార్థులకు 25శాతం సీట్లను కేటాయించాల్సి ఉన్నా నిర్లక్ష్యం చూపుతున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలలకు వెళితే సరైన సరైన సమాధానం చెప్పడం లేదు. తమ పాఠశాలలను ఎందుకు ఎంచుకున్నారని బెదిరింపులకు దిగుతుండడం ..పుస్తకాలు, యూనిఫామ్‌కు నగదు చెల్లించాల్సిందేనని చుక్కలు చూపిస్తున్నారు. దీంతో పేద విద్యార్థులు ఉచిత విద్యకు దూరమవుతున్నారు.



ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: విద్యాహక్కు చట్టం -2009 ప్రకారం 6 నుంచి 14 ఏళ్లలోపు పిల్లలకు ప్రభుత్వం ఉచిత నిర్బంధ విద్యనందించాలి. అందులో భాగంగానే ప్రైవేట్ పాఠశాలల్లో 25శాతం సీట్లను పేద విద్యార్థుల కోసం కేటాయించేలా చర్యలు తీసుకోవాలి. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ చర్యలన్నీ తూతూమంత్రంగా సాగుతున్నాయి. గతేడాది ఉచిత విద్యకు సంబంధించి అసలు నోటిఫికేషన్‌నే జారీ చేయలేదు. ఈ నేపథ్యంలో వేలాది మంది విద్యార్థులు నష్టపోయారు. ఈ ఏడాది పేద ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవడంతో గత నెలలో ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ జారీ చేసింది. మే 2 నుంచి 19వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. స్థానిక సచివాలయం, ఎంఈఓ కార్యాలయాలు, మీసేవ సెంటర్లలో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు. అయితే పేద విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈఓ కార్యాలయాలు, సచివాలయాలకు వెళ్తే బయట ఇంటర్నెట్, మీసేవ కేంద్రాల్లో చేసుకోవాలని సూచించారు. చేసేదేమీ లేక బయట నగదు చెల్లించి దరఖాస్తు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

సీట్ల కేటాయింపు ఇలా..

ఉచిత విద్యకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సీట్లు లాటరీ పద్ధతిలో సీట్లు కేటాయిస్తారు. ముఖ్యంగా అనాథ, హెచ్ఐవీ బాధిత, దివ్యాంగ పిల్లలకు 5శాతం, షెడ్యూల్డ్ కులాలకు పదిశాతం, షెడ్యూల్ తెగలకు నాలుగు శాతం సీట్లు కేటాయించాల్సి ఉంటుంది. ఓసీ పిల్లలకు గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ సంవత్సర ఆదాయం రూ.1,20,000, పట్టణ ప్రాంతాల్లో కుటుంబ ఆదాయం రూ.1,44,000లోపల ఉంటే 6శాతం సీట్లు కేటాయింపు చేయాల్సి ఉంటుంది. అయితే దరఖాస్తులు సమర్పించే సమయంలో స్థానిక సచివాలయానికి 1కి.మీ పరిధిలో ఉన్న స్కూళ్లను కూడా 3కి.మీ పరిధిలో చూపించడంతో ఇటీవల విడుదల చేసిన మొదటి విడతలో సీట్లు రాలేదు. జిల్లా వ్యాప్తంగా మొదటి విడతలో 576మంది వివిధ ప్రైవేటు పాఠశాలలకు ఎంపికయ్యారు. సంబంధిత పాఠశాలలో ప్రవేశానికి సంబంధించిన పత్రాలు సమర్పించాలని తల్లిదండ్రులకు అధికారులు సూచించారు. అయితే పాఠశాలలకు వెళితే సమాధానం చెప్పకపోగా, మీరు మా పాఠశాలను ఎందుకు ఎంచుకున్నారంటూ ఎదురు ప్రశ్నలు వేసి ఇబ్బందులకు గురిచేశారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యాహక్కు చట్టం నిబంధనల ప్రకారం సీటు పొందిన విద్యార్థులు ఒక్క రూపాయి కూడా చెల్లించనవసరం లేదు. అయితే కొన్ని పాఠశాలల్లో మీకు ఫ్రీసీట్ వచ్చినా నగదు చెల్లించాల్సిందేనని బెదిరిస్తున్నారని, ఈ విషయమై సంబంధిత ఎంఈఓలకు ఫోన్ చేసినా పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

చట్టమంటే లెక్కలేదు

విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో 25శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయించాలి. అందుకు ప్రభుత్వం ఫీజు చెల్లిస్తుంది. అయితే ప్రైవేటు యాజమాన్యాలు అడిగినంత కాకుండా ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులనే చెల్లిస్తారు. అయితే భారీగా ఫీజులు వసూలు చేసే రెండు ప్రధాన స్కూళ్లకు ఈ విధానం మింగుడు పడటం లేదు. ఈ రెండు స్కూళ్లలోనే సమస్యలు తలెత్తుతున్నాయని ఎంఈఓలు చెబుతున్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థల్లో ముక్కుపిండి మరీ..

జిల్లాలోని ప్రైవేట్ విద్యా సంస్థల్లో విద్యాహక్కు చట్టం కింద సీట్లు పొందిన విద్యార్థులకు చుక్కలు చూపిస్తున్నారు. యూనిఫాం, పుస్తకాలు, తదితరాలకు సంబంధించి రూ.16వేలపైన కట్టాలని లెక్క చూపుతున్నారు. ప్రస్తుతం కట్టలేం, సమయమివ్వాలని తల్లిదండ్రులు కోరుతున్నా కనికరించడంలేదు. నగదు కడితేనే చేర్చుకుంటామని తెగేసి చెబుతున్నారు. దిక్కున్నచోట చెప్పుకోండి అంటూ దురుసుగా వ్యవహరిస్తున్నారు. ఈ అనుభవం నెల్లూరురూరల్ వావిలేటిపాడురోడ్డులోని నారాయణ స్కూల్‌లో సీటు పొందిన బాలుడిని చేర్పించేందుకు వెళ్లిన తల్లిదండ్రులకు ఎదురైంది. వారు ఎంఈఓకు ఫిర్యాదు చేసినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. ఎంఈఓలు తమ అధిపతి, మంత్రి నారాయణ దగ్గరకు ట్రాన్స్‌ఫర్స్, ప్రమోషన్స్ కోసం వస్తుంటారని, ఈ విషయంలో తమను ఎవరూ ఏం చేయలేరని ఆ పాఠశాలలో పని చేసే ఓ వ్యక్తి బహిరంగంగా వ్యాఖ్యానించడం గమనార్హం. ఈ విషయమై డీఈఓ బాలాజీరావును వివరణ కోరగా ఆయన సైతం నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. తమకేం తెలియదని, తామేం చేయలేమని సమాధానం ఇచ్చారు.

పేదలంటే చంద్రబాబుకు హేళన భావం



“ పేద ప్రజలంటే సీఎం చంద్రబాబుకు హేళనగా ఉంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల ప్రైవేటు పాఠశాలల్లో పేదలకు తక్కువ ఫీజుతో ప్రవేశం కల్పించాం. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ విషయమై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఇది సరైన పద్ధతి కాదు.

–ప్రసన్నకుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, కోవూరు

కౌన్సిల్ సాధారణ సమావేశం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. నగర పంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అజెండాలో పొందుపరిచిన పది అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రతి వార్డుకు రూ.10లక్షలు నిధులు కేటాయించామని తెలిపారు. ఈ నిధులతో ఆయా వార్డుల పరిధిలో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ బాలకృష్ణ, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల పేరుతో పేదలపై భారం మోపుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ అన్నారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్మార్ట్‌మీటర్ల వలన విద్యుత్ బిల్లుల్లో తేడాలు వస్తున్నాయని పేర్కొన్నారు. స్మార్ట్‌మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు వెంకటేశ్వర్లు, వెంకమరాజు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

1న ఆటో కార్మిక సంఘం జిల్లా మహాసభలు



మాట్లాడుతున్న రాజా

తోటపల్లిగూడూరు: జూలై 1వ తేదీన బుచ్చిరెడ్డిపాళెంలో జరిగే ఆటో కార్మిక సంఘం ఆరో జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు మారుబోయిన రాజా పిలుపునిచ్చారు. నరుకూరులోని సీఐటీయూ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆటో కార్మికుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి సరిగా లేదన్నారు. ర్యాపిడో, ఓలా వంటి ఆన్‌లైన్ రవాణా సంస్థల వల్ల అనేక మంది ఆటో డ్రైవర్లు రోడ్డున పడుతున్నారన్నారు. ఇప్పటికే బాడుగలు సక్రమంగా లేక సతమతమవుతున్న ఆటో కార్మికులపై వివిధ రకాల ట్యాక్స్‌లు విధిస్తూ మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. అందుకే రవాణారంగ రక్షణ కోసం, డ్రైవర్ల సంక్షేమ బోర్డు సాధన కోసం జూలై 9న సీఐటీయూ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా సమ్మె చేపడుతున్నామని తెలిపారు. అందులో భాగంగా దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ బుచ్చిరెడ్డిపాళెంలో ఆటో కార్మిక సంఘం ఆరో జిల్లా మహాసభలను నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని ఆటో కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మిక సంఘం నాయకులు నాశిన పరంధామయ్య, గోపి, శివ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ వసుమతి

మనుబోలు: పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎల్‌డీఓ వసుమతి సూచించారు. మనుబోలు పంచాయతి పరిధిలో పారిశుధ్య పనులను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణలో రాజీ పడవద్దన్నారు. గ్రామాల్లో ఎక్కడా చెత్త పోగుపడకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. ఇళ్లలో పోగుపడే చెత్తను వీధుల్లో పారబోయకుండా గ్రీన్‌అంబాసిడర్లకు అందజేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వర్షాకాలం సమీపిస్తున్నందున గ్రామాల్లో ఎక్కడా చెత్త పేరుకుపోకుండా నిరంతరం పారిశుధ్య పనులను పర్యవేక్షించాలన్నారు. ఆమె వెంట ఎంపీడీఓ జలజాక్షి, సచివాలయ సిబ్బంది నబియా, కరిష్మా వున్నారు.

అదనపులోడు క్రమబద్ధీకరణకు 30వరకు గడువు



మాట్లాడుతున్న ఈఈ కే రమేష్‌చౌదరి

కోవూరు: విద్యుత్ వినియోగదారులకు ఏపీఎస్పీడీసీఎల్ కల్పించిన 50శాతం రాయితీతో అదనపులోడు క్రమబద్ధీకరణ పథకం గడువు ఈ నెల 30వ తేదీతో ముగియనుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే రమేష్‌చౌదరి తెలిపారు. కోవూరు విద్యుత్ డివిజన్ కార్యాలయంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లతో శనివారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50శాతం డెవలప్‌మెంట్ చార్జీల రాయితీ గృహ వినియోగదారులకు మాత్రమే కల్పిస్తున్నట్లు చెప్పారు. అధికంగా విద్యుత్ వినియోగించుకునేవారు లోడును క్రమబద్ధీకరించుకుంటే జరిమానాల నుంచి మినహాయింపు లభిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్యఘర్ పథకం ద్వారా సౌరవిద్యుత్‌ను ఏర్పాటు చేసుకునే వారికి రాయితీని అందిస్తుందని తెలిపారు. సౌరవిద్యుత్‌ను ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవచ్చన్నారు. వినియోగదారులకు అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేలా చూడాలని విద్యుత్ సిబ్బందికి సూచించారు.

శ్రీవారికి పల్లకిసేవ

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారికి పల్లకిసేవను శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం దేవదేవేరులకు విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. శ్రీవారు విశేషాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

తగ్గని భగభగలు

పొదలకూరు: వేసవి భగభగలు ఏమాత్రం తగ్గడం లేదు. మేలో వర్షాల తర్వాత జూన్ మాసంలో వేసవి సెగలు ప్రతాపం చూపుతున్నాయి. ఉష్ణోగ్రతలు తక్కువగా చూపుతున్నా ఉక్కపోత, సెగలు ఏమాత్రం తగ్గడం లేదు. పట్టణంతో పాటు గ్రామాల్లోనూ ఎండవేడిమికి ప్రజలు అల్లాడిపోతున్నారు. వృద్ధులు, పిల్లలు ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్నారు. ఉష్ణోగ్రతలు 37, 38 డిగ్రీలు నమోదవుతున్నా వేడిమాత్రం 42 డిగ్రీలకు సమానంగా ఉంటోంది. గ్రీష్మ తాపానికి పడమటి గాలులు తోడు కావడంతో ప్రజలు నీరసించిపోతున్నారు. పడమటి గాలులకు భూగర్భజలాలు అడుగంటడం, పైర్లు ఎండుముఖం పడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఈఓపీఆర్డీగా మహేశ్వరి బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన మహేశ్వరి

కొడవలూరు: మండల ఈఓపీఆర్డీగా ఎస్ మహేశ్వరి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె జలదంకి మండల ఈఓపీఆర్డీగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఈఓపీఆర్డీగా పని చేస్తున్న సాయిప్రసాద్ డీపీఓ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆయన బదిలీ కావడంతో కొడవలూరు పంచాయతీ కార్యదర్శి మురళి కొడవలూరు ఈఓపీఆర్డీగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తూ వచ్చారు.

సమస్యల పరిష్కారానికి వినతి



పాలిటెక్నిక్ కళాశాలను పరిశీలిస్తున్న నేతలు

నెల్లూరు (టౌన్): ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సమస్యలను పరిష్కరించాలని డీవైఎఫ్ఐ నేత విక్రమ నరసింహ కోరారు. వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వసతులను డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నేతలు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కళాశాలకు ప్రహరీ లేకపోవడంతో రాత్రి వేళ కొందరు ప్రవేశించి మద్యం సేవిస్తున్నారని ఆరోపించారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని చెప్పారు. యశ్వంత్, శేఖర్, రాజేష్, సురేంద్ర, సునీల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో బోధన



అంగన్‌వాడీలకు పుస్తకాలను అందజేస్తున్న సూపర్‌వైజర్

కొడవలూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన బోధన అందిస్తున్నామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టీ నాగభూషణమ్మ తెలిపారు. మండలంలోని నార్తురాజుపాళెంలోని రైటర్‌తోపు అంగన్‌వాడీ కేంద్రంలో సెక్టార్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడేళ్లు నిండిన చిన్నారులకు ప్రీస్కూల్ విద్యను అందిస్తున్నామని తెలిపారు. ఐదేళ్లు నిండిన తరువాత నేరుగా ఒకటో తరగతిలో పాఠశాలలో చేర్పడం జరుగుతుందన్నారు. ఒకటో తరగతికి తగ్గ సామర్థ్యాలను అందించేందుకు నూతన పుస్తకాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ప్రతిరోజూ పిల్లలతో పుస్తకాలను విధిగా రాయించాలని సూచించారు. అంగన్‌వాడీలు పీ విజయమ్మ, వై రాజమ్మ, టీ భారతి, కే సునీత, డీ దేవసేన, ఎన్ సుదర్శన, పీ చెంచమ్మ పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జిని కలిసిన న్యాయశాఖ ఉద్యోగులు



నెల్లూరు (లీగల్): ఏపీ హైకోర్టు జడ్జి, నెల్లూరు జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ శ్రీనివాసులురెడ్డిని నగరంలోని ఆర్ అండ్ బీ అతిథిగృహంలో న్యాయశాఖ ఉద్యోగుల సంఘ జిల్లా నేతలు మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. పలు అంశాలపై వినతిపత్రాన్ని అందజేశారు. అధ్యక్షుడు సురేష్‌బాబు, జనరల్ సెక్రటరీ నారాయణ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, కోశాధికారి సునీల్‌కుమార్, సంఘ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ శివ కుమార్, నేతలు సుమన్, వేణుగోపాల్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

⇨ ఏపీ హైకోర్టు జడ్జి, నెల్లూరు జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి శ్రీనివాసులురెడ్డిని నెల్లూరు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో గెలుపొందిన ఐక్యవేదిక అభ్యర్థులు, న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిశారు. బార్ అసోసియేషన్‌కు సంబంధించిన పలు అంశాలపై వినతిపత్రాన్ని అందజేశారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జల్లి పద్మాకర్, కోశాధికారి పెంచల ప్రణీత్, లైబ్రరీ సెక్రటరీ నాగ శ్రీనివాస్, ఈసీ మెంబర్లు జితేంద్ర, శ్రీధర్, మమత, నేతలు కుడుముల రవికుమార్, భానురామణ్, శంకరయ్య, కేవీఆర్ నాయుడు పాల్గొన్నారు.

రాజకీయ దురుద్దేశాలతో కేసులు తగవు



మాట్లాడుతున్న లీగల్ సెల్ నాయకులు

కోవూరు: రాజకీయ దురుద్దేశాలతో నాయకులపై కేసులు నమోదు చేయడం తగదని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ నాయకులు శ్యామాచార్యులు, అనూప్ రెడ్డి ఖండించారు. కోవూరులో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పల్నాడు పర్యటన సందర్భంగా చోటు చేసుకున్న విషాదానికి సంబంధించి మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై తప్పుడు అభియోగాలు మోపడం దారుణమన్నారు. దేశంలో ఎక్కడైనా రోడ్డు ప్రమాదం జరిగితే వాహన డ్రైవర్ మీద మాత్రమే కేసు నమోదు చేస్తారన్నారు. కానీ పల్నాడు ఘటనలో రాజకీయ నాయకులపై ఓ వీడియో క్లిప్పింగ్ ఆధారంగా తప్పుడు అభియోగాలు మోపారన్నారు. టీడీపీ సోషల్ మీడియాలో వచ్చిన వీడియో క్లిప్పింగ్ ఆధారంగా కేసులు నమోదు చేయడం కేవలం జగన్‌మోహన్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని కుట్రకు పాల్పడ్డారని ఖచ్చితంగా నమ్ముతున్నామన్నారు. ప్రజాదరణ కలిగిన నాయకుడిపై కేసులు పెడితే వెనకడుగు వేస్తాడనే భ్రమలో ప్రభుత్వం ఉందని, ఇది ప్రజాస్వామ్యాన్ని అవమానించడమేనన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పల్నాడు పర్యటన రాష్ట్ర ప్రభుత్వ భద్రతా వైఫల్యాన్ని బట్టబయలు చేసిందన్నారు. జడ్‌ప్లస్ కేటగిరి భద్రత కలిగిన ఆయన సమీపంలోకి గుర్తుతెలియని వ్యక్తులు చేరుకోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఆయన వాహనం బానెట్‌పైకి ఏకంగా ఓ యువకుడు ఎక్కినా పోలీసులెవరూ స్పందించకపోవడం విచిత్రమన్నారు. జడ్‌ప్లస్ భద్రతా నిబంధనల ప్రకారం వాహనానికి ముందు ఎస్కార్ట్ వాహనం, ఇరు వైపులా రోప్ పార్టీ సిబ్బంది ఉండాలన్నారు. కానీ ఇవేమీ అక్కడ కనిపించలేదన్నారు. సింగయ్య మృతిపై కేసు నమోదు చేసిన పోలీసులు మృతుడికి న్యాయం చేయడం కన్నా రాజకీయం చేయడానికే ఆసక్తి చూపించారని అనిపిస్తోందన్నారు. ఓ వీడియో ఆధారంగా వాహనంలో ఉన్న వైఎస్ జగన్‌పై అభియోగాలు మోపడం చూస్తే దాని వెనుక చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రభుత్వ రాజకీయ దురుద్దేశం స్పష్టమవుతోందన్నారు. ఈ సమావేశంలో వైస్ఎంపీపీ శివునినారసింహారెడ్డి, ఆదినారాయణరెడ్డి, మధురెడ్డి, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు .

పీడీఎస్‌యూ నగర కమిటీ సమావేశం

నెల్లూరు (టౌన్): విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సాగర్ ఆరోపించారు. నగరంలోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన పీడీఎస్‌యూ నగర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందనే కారణంతో గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలలను మూసేస్తున్నారని ఆరోపించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు సునీల్ మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తామని చెప్పిన మంత్రి లోకేశ్ పట్టించుకోవడంలేదని విమర్శించారు. పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి షారూఖ్, నగరాధ్యక్షుడు ఆశిర్, జిల్లా కమిటీ సభ్యులు అన్వర్, మస్తాన్, నవీన్, సుబ్బు, హర్ష, లోకేశ్ పాల్గొన్నారు.